క్లుప్తంగా

వేసవిలో చిన్నారుల ఆరోగ్యం జాగ్రత్త

కపిలేశ్వరపురం: వేసవిలో చిన్నారుల ఆరోగ్యం పై వారి సంరక్షకులు శ్రద్ధ వహించాలని అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శివరంజని సూచించారు. ఎఫ్‌పీసీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కాలేరు, అచ్యుతాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. సచివాలయాలు వద్ద ఏర్పాటు చేసిన శిబిరాల్లో సుమారు 60 మందికి చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో ఎంపీహెచ్‌ఎస్ ఎస్.నూకరాజు, ఆరోగ్య కార్యకర్త పుష్పావతి, ఎంఎల్‌హెచ్‌పీ ఎం.ఐశ్వర్య, ఆశా కార్యకర్తలు రాణి, నిర్మలాకుమారి, శ్యామలాగౌరి, శిరీష, నిర్మల సేవలందించారు.

ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు



కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీపీ వెంకటరమణ తదితరులు

రాయవరం: మండలంలోని వెంటూరులో ఉపాధి కూలీలకు శుక్రవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ గ్రామంలోని చెరువును 'అమృత్ సరోవర్'లో భాగంగా ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులు చేపట్టారు. రూ.10.55 లక్షల వ్యయంతో ఈ చెరువు పూడికతీత పనులు చేపట్టినట్లు ఉపాధి ఏపీవో జె.సుధారాణి తెలిపారు. ఈ పనుల్లో పాల్గొన్న కూలీలకు ఏపీవో సుధారాణి ఆధ్వర్యంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీడీవో డి.శ్రీనివాసుల చేతుల మీదుగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో వడగాడ్పులకు గురైనా, ప్రమాదాలు చోటు చేసుకున్నా తక్షణం ప్రథమ చికిత్స అందించేందుకు సచివాలయ ఏఎన్‌ఎంను అందుబాటులో ఉంచుతున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసు తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన

రాయవరం: మండలంలోని వెంటూరులో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీడీవో డి.శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. డ్రైనేజీ లేక చాలాకాలంగా ఆ గ్రామంలోని హనుమంతునగర్ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో రూ.5 లక్షల నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎంపీపీ వెంట సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు, ఉప సర్పంచ్‌నున్న ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో చివరిదశ కీలకమే

కాజులూరు: వరి సాగులో నారుపోసిన దశ నుంచి పంట మాసూలు చేసి గింజలు ఒడ్డుకి చేర్చే వరకూ అన్ని దశలు కీలకమైనవేనని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని చేదువాడ, తిప్పరాజుపాలెం, కాజులూరు తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారి పంట పొలాలను పరిశీలించి క్షేత్రస్థాయిలో రైతులకు పలు సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ మండల గ్రామాలలో వరి గింజ గట్టిపడే దశ నుంచి మాసూలు దశకు చేరువలో ఉందన్నారు. 15 నుంచి 20 రోజుల్లో కోతకోసే పరిస్థితి ఉండటంతో కొందరు రైతులు పంటలను అంతగా పట్టించుకోరని అయితే ఈ దశలోనూ పంటపై తెగుళ్ల సోకితే గింజ తేలికగా మారి దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఈ చివరి దశలోనూ రైతులు పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తెగుళ్లను గమనించాలని అవసరమైతే వ్యవసాయాధికారులను సంప్రదించి మందులు వాడాలన్నారు.

ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

కాజులూరు: ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలో మే ఏడున రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జరగనున్న ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు వరదా శేషారావు కోరారు. శుక్రవారం మండల ఆర్యవైశ్యసంఘం నాయకులు మండల గ్రామాల్లో పర్యటించి సమావేశానికి హాజరు కావలసిందిగా సభ్యులను కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మల్లేశ్వరరావు, సభ్యులు కొత్త రాజా, వంకాయల కామరాజు, కందుల రమేష్, మన్యం సుభాష్‌చంద్రబోస్, చెక్కా వెంకట్రావు, పచ్చిపులుసు సూర్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యను పక్కదారి పట్టిస్తున్నారు

మండపేట: మసీదు స్థల వివాదం పరిష్కారం పేరిట అధికార పార్టీ నాయకులు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆరోపించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రధాన కూడలిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. అక్రమ నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకునేంత వరకూ తాను వెనక్కి తగ్గేది లేదన్నారు. పార్టీ నాయకులు పిల్లి అప్పన్న, కె దుర్గారావు, కె వెంకట సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో ఆధ్యాత్మిక సందడి

- ముగిసిన ఉపవాస దీక్షలు
- నేడు రంజాన్ పర్వదినం



రంజాన్ వేడుకలకు ముస్తాబైన మసీదు



రాయవరం మండలం వెదురుపాకలో నమాజు చేస్తున్న ముస్లింలు

రాయవరం: ఇస్లాంలో రంజాన్ మాసానికి ప్రత్యేకత ఉంది. ఈ నెలలోనే దివ్య ఖురాన్ భువిపై అవతరించింది. అందుకే ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఈ నెలంతా ఉపవాస దీక్షలు చేస్తారు. రోజు ఐదు పూటలా నమాజులతో పాటు ప్రత్యేకంగా తరావీ ప్రార్థనలు చేస్తూ, ఖురాన్‌ను పఠిస్తున్నారు. గత నెల 23 నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది.

క్లస్టర్ పరిధిలో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని పలు గ్రామాల్లో ముస్లింలు రంజాన్ ఉపవాస దీక్షలు పాటిస్తున్నారు. ఈ మండలాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట, ద్రాక్షారామం, కె.గంగవరం, కాజులూరు, వెదురుపాక, లొల్ల, రాయవరం, చెల్లూరు, పసలపూడి, ఏడిద, మండపేట తదితర గ్రామాల ముస్లింల ఇంట రంజాన్ సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా సహరీ, ఇఫ్తార్ సమయంలో మసీదుల వద్ద ఆధ్యాత్మిక సందడి కనిపిస్తోంది. రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేయడమే గాకుండా మసీదులను విద్యుత్తు దీపాలతో అలంకరించారు.

వెల్లివిరుస్తున్న భక్తి భావం..

దివ్య ఖురాన్, హదీస్ ఇస్లాంకు పవిత్ర మత గ్రంథాలు. భక్తిగా ఉండడం దైవ ప్రార్థనలు చేయడం, మద్యపానానికి దూరంగా ఉండడం, అబద్ధం ఆడకపోవడం వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని గ్రంథాలు బోధిస్తున్నాయి. ఉపవాసం ఆచరించే వారంతా తెల్లవారుజామున తీసుకునే సహరి నుంచే దైవచింతనతో గడుపుతారు. పగలంతా ఉపవాస దీక్షను ఆచరించడం, సూర్యాస్తమయం తర్వాత ఇఫ్తార్ చేశాక రాత్రి ప్రత్యేక తరావీ ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. సహరి, ఇఫ్తార్ చేసేందుకు సౌకర్యంలేని వారికి, పేదల కోసం దాదాపు ప్రతి మసీదులోనూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉచితంగా సహరి, ఇఫ్తార్ ఏర్పాటు చేస్తున్నారు.

దానధర్మాలు..

జకాత్ రూపంలో దాన ధర్మాలు చేసి పేదలను ఆదుకోవడం, పేదవాని ఆకలి తీర్చడం కోసం ముస్లింలు ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రతి ముస్లిం తన స్థిర, చరాస్తుల నుంచి 4వ భాగాన్ని పేదలకు తప్పనిసరిగా ఇవ్వాలని ఖురాన్ చెబుతోంది. దీక్షను విరమించే సమయంలో చేపట్టే ఇఫ్తార్‌లు సోదరభావం, సౌభ్రాతృత్వానికి పెద్దపీట వేస్తాయి. సాయం సంధ్య వేళ మసీదుల వద్ద చేపట్టే ఇఫ్తార్‌తో సోదరభావం పెంపొందుతోంది. నెలపొడుపు కనిపించిన మర్నాడు రంజాన్ పర్వదినాన్ని నిర్వహించనున్నారు. శనివారం రంజాన్ పర్వదినం నిర్వహించేందుకు ముస్లింలు సమాయత్తం అవుతున్నారు.

పవిత్రంగా భావిస్తాం..



రంజాన్ మాసాన్ని ప్రతి ఒక్కరం పవిత్రంగా భావిస్తాం. అల్లా సూచించిన మార్గంలో నియమ నిష్టలు పాటిస్తాం. కఠినమైన ఉపవాస దీక్షలు చేసి, అల్లా కృపకు పాత్రులవుతాం. రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– జనాబ్ అబ్దుల్ కరీం, అధ్యక్షుడు, జామియా అండ్ మదీనా మసీదు కమిటీ, రామచంద్రపురం

విధిగా దాన ధర్మాలు



రంజాన్ మాసం ధానధర్మాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ మాసంలో ప్రతి ముస్లిం విధిగా దాన ధర్మాలు చేస్తుంటారు. ప్రతి ఒక్కరూ అత్యంత పవిత్రంగా ఉంటూ, భక్తి శ్రద్ధలతో అల్లాహ్‌ను ప్రార్థిస్తుంటారు. ఇది అల్లాహ్‌కు ఇష్టమైన మాసం.

– షేక్ ఖాదర్ వలీ, గౌరవాధ్యక్షుడు, అల్ హిదయతుల్ ముస్లిం వెల్ఫేర్ కమిటీ, పసలపూడి, రాయవరం మండలం

ఎంతగానో ఎదురుచూసిన దినం



ద్రాక్షారామ మార్కెట్ మసీదు

రామచంద్రపురం రూరల్: ఏడాది పాటు ముస్లింలందరూ ఎంతగానో ఎదురుచూసిన రంజాన్ రావడంతోనే నెల రోజులుగా ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు పాటించారు. అల్లాహ్ మానవాళి శ్రేయస్సు కోసం భువికి పవిత్ర ఖురాన్‌ను పంపి ఆ ఉత్తమ మార్గంలో నడిచి అత్యుత్తమ గతులు పొందేందుకు ఈ మాసంలో అవకాశం కల్పించారని నమ్మి ఈ మాసమంతా ముస్లింలు కఠినమైన నియమనిష్టలు, సత్యపాలన, ఉపవాస దీక్షలు చేశారు. రోజా (ఉపవాస దీక్ష), నమాజ్, జికర్, తరావీ తదితర నియమాలను విధిగా పాటించారు. పవిత్ర ఖురాన్ పఠనం ద్వారా మానవుడిలో సత్యం, న్యాయం, రుజువర్తన, మంచితనం, మానవత్వం తదితర ఉత్తమ గుణాలు అలవడతాయని, ఇతర మాసాలవలె గాక ఈ పవిత్ర మాసంలో ఒక్క చిన్న పుణ్యకార్యం చేసినా 70 రెట్ల ఫలితం ఉంటుందని విశ్వసిస్తారు. రంజాన్ రోజు ఒకరికొకరు ఆలింగనాలు చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకుంటారు. పాయసాలు ఇంటి చుట్టుపక్కల వారికి పంచుకుంటారు.

దివ్యమార్గంలో పయనిద్దాం



మానవాళిలో మంచిని పెంచేందుకు దైవం ఈ లోకానికి దివ్య ఖురాన్‌ను అందజేశారు. దైవం సూచనల ప్రకారం జీవితాన్ని గడుపుతూ ఆయనకు దగ్గరవుతూ ఉత్తమ గతులు పొందేందుకు నిరంతరం కృషి చేయాల్సి ఉంది. అందుకు రమజాన్ మాసానికి మించింది లేదు.

– మీరాజ్ అస్కరీ హుస్సేన్, మతగురువు, ద్రాక్షారామ

స్పందన వినతులు సకాలంలో పరిష్కరించాలి



ఉద్యోగులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ రాజు

మండపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీఓ ఐ. రాజు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం, స్వమిత్ర, చలివేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ వీఎస్ ప్రసాద్ అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో సచివాలయాలకు వచ్చే ప్రజలకు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మండలంలో 12 పంచాయతీలకు 11 పంచాయతీల్లో పన్నుల వసూళ్లు పూర్తయ్యిందని, ద్వారపూడిలో కోర్టు కేసుల నేపథ్యంలో కొన్ని బకాయిలు రావాల్సి ఉందన్నారు. అర్తమూరు, జెడ్.మేడపాడు గ్రామాల్లో స్వమిత్ర సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అలాగే గృహ నిర్మాణ లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల పొదుపు ఖాతాల నుంచి రుణసాయం మంజూరుకు కృషిచేయాలని ఎంపీడీఓ రాజు సూచించారు.

ఆధార్ నమోదు ప్రక్రియలో అలసత్వం వద్దు



సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కె.గంగవరం: ప్రభుత్వం అనుమతించిన ఆధార్ నమోదు కేంద్రాల్లో లబ్ధిదారులపై అలసత్వం వహించొద్దని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ హెచ్చరించారు. మండల కేంద్రమైన కె.గంగవరం ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం సచివాలయ సిబ్బందితో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధార్ నమోదు ప్రక్రియ పలు సమస్యలపై మండలంలో ఫిర్యాదులు అందుతున్నాయని వాటిని సిబ్బంది వెంటనే పరిష్కరించాలని సూచించారు. బాలాధార్ నమోదులో మండలం వెనుకబడి ఉందని సిబ్బంది వాటిపై దృష్టి వహించాలని కోరారు. దీంతో పాటు జగన్న కాలనీలలో గృహ లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని చూడాలని సూచించారు. ఈఓపీఆర్డీ నాగేంద్ర, తహసీల్దార్ వైద్యనాథశర్మ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గృహ నిర్మాణదారులకు సహకారం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రాజు

రామచంద్రపురం రూరల్: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణదారులకు అన్ని విధాలుగా సహకరించి నిర్మాణాలు త్వరితగతిన ప్రారంభించేలా, వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డ్వాక్రా యానిమేటర్లకు అధికారులు దిశా నిర్దేశం చేశారు. రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఎ.శాంతి, మండల ప్రత్యేక అధికారి ఎంజీఎస్‌ఆర్‌ఎల్‌ఎన్ రాజులు సూచించారు. ఇళ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభించని వారి విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని డ్వాక్రా ద్వారా వారి రుణ సహకారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జి.రామకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు టోపీలు



కార్మికులకు టోపీలు అందజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య

మండపేట: ఎండల తీవ్రత దృష్ట్యా పట్టణంలో పారిశుధ్య విధులు నిర్వర్తించే కార్మికులకు శుక్రవారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య టోపీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి వడదెబ్బకు గురికాకుండా పారిశుధ్య విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కార్మికులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

223 మంది ఆధార్ నవీకరణ

కపిలేశ్వరపురం: మండలంలోని అద్దంకివారిలంక, టేకి గ్రామాల సచివాలయాల్లో ఈనెల 19 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక కేంద్రాల్లో 223 మంది ఆధార్ కార్డులను డిజిటల్ అసిస్టెంట్లు నవీకరించారు. అద్దంకివారి లంకలో ఇనుమర్తి వీర మల్లేశ్వరరావు 78 మంది, టేకిలో కోరా దొరబాబులు 145 మంది మొత్తం 223 మంది వివరాలను నవీకరించారు. లబ్ధిదారుల తమ వేలి ముద్రలు, ఫొటో, ఐరిష్‌లతో పాటు పేరు, చిరునామా తదితర వివరాలను నవీకరించుకున్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

కె.గంగవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలని ఎంఈఓ ఎ.నాగరాజు సూచించారు. మండలంలోని కోట, దంగేరు, మసకపల్లి తదితర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిర్వాహకులు రుచిగా శుభ్రంగా ఆహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ప్రతి పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు. పాఠశాలల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.



కె.గంగవరంలో విద్యార్థుల నుంచి సమాచారం సేకరిస్తున్న ఎంఈఓ నాగరాజు

రోగులకు ఉచిత వైద్య పరీక్షలు



ఉచిత వైద్య శిబిరంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు



కపిలేశ్వరపురంలో రోగి ఇంటి వద్ద చికిత్స చేస్తున్న డాక్టర్ రత్నకుమారి



అంగరలో కంటి పరీక్ష చేస్తున్న కోటేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద సుఖీభవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణ ప్రముఖుడు చందమామ వాసు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, డాక్టర్ చప్పిడి ఇషాదీప్తి, కంటి వైద్య నిపుణుడు రాజేష్‌లు సుమారు 550 మంది రోగులను పరీక్షించి వైద్యసేవలు అందించారు. ముందుగా చప్పిడి వెంకటేశ్వరరావు రోగాల బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి నేదూరి శేషగిరిరావు, వనుం ఉపేంద్రనాథ్, వాసంశెట్టి వెంకటరమణ, నాగమణి, హేమ, ఈత ప్రసాద్ గుండుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

124 మందికి వైద్య సేవలు

కపిలేశ్వరపురం: స్థానిక బీసీ ఏరియా రామాలయం వద్ద శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్‌ఎస్‌డీ రత్నకుమారి 124 మందికి వైద్యసేవలందించారు. శిబిరానికి రాలేని రోగులను వారి ఇళ్లకు వెళ్లి చికిత్స చేశారు. ప్రతి నెలా 3వ శుక్రవారం రామాలయం వద్ద వైద్య శిబిరాలను కొనసాగించనున్నట్టు రత్నకుమారి తెలిపారు. శిబిరాన్ని కపిలేశ్వరపురం సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు శీలం భాస్కరరావు సందర్శించారు. శిబిరంలో 104, అంగర పీహెచ్‌సీ సిబ్బంది సేవలందించారు.

అంగరలో కంటి పరీక్షలు

డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా మండలంలోని అంగర గ్రామంలో శుక్రవారం 40 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. పారా మెడికల్ ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.కోటేశ్వరరావు పరీక్షలు చేసి, వారిలో 25 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. నలుగురికి శస్త్ర చికిత్సలు చేయించాలని నిర్ణయించారు. శిబిరాన్ని సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మేడిశెట్టి దుర్గారావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు సందర్శించారు. శిబిరంలో వైద్య ఆరోగ్య కార్యకర్తలు సేవలందించారు.

వైఎస్సార్ నగర్‌లో సదుపాయాలు కల్పిస్తాం

- చైర్‌పర్సన్ దుర్గారాణి
- సీసీ రోడ్ల నిర్మాణానికి క్షేత్రస్థాయి పరిశీలన



సీసీ రోడ్డు నిర్మాణానికి కొలతలు వేయిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: డపేటలో మినీ టౌన్ షిప్‌గా అభివృద్ధి చెందుతున్న వైఎస్సార్ నగర్ (గొల్లపుంత కాలనీ)లో ప్రజావసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పేర్కొన్నారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణం కోసం శుక్రవారం చైర్‌పర్సన్ దుర్గారాణి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ప్రతిపాదనలు సిద్ధం చేయించేందుకు మున్సిపల్ అధికారులతో రోడ్లకు కొలతలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే కాలనీలో దాదాపు రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, అక్కడక్కడా మిగిలి ఉన్న వాటి నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. మెరుగైన పారిశుధ్యం లక్ష్యంగా కాలనీలో గృహాల సంఖ్య మేరకు పూర్తిస్థాయిలో అవసరమైన పారిశుధ్య కార్మికుల ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు ఆదేశాలిచ్చామన్నారు. అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బీసీ జనగణనతో మైనారిటీ బీసీలకు మేలు



కొసనా కామేశ్వరరావు

రామచంద్రపురం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీ జనగణన చేపట్టేందుకు తీసుకుంటున్న చర్యలతో మైనార్టీ బీసీలకు ఎనలేని మేలు జరుగుతుందని నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొసనా కామేశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. బీసీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి బాటలు వేస్తున్నారన్నారు. ఇప్పటికే బీసీలలో అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజకీయ సాధికారత కల్పించారన్నారు. నవరత్నాల పథకాలతో ఆర్థిక, సామాజిక సాధికారతకు చేయూత ఇస్తున్నారని కామేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నియోజకవర్గంలో మైనార్టీ బీసీలకు అండగా నిలుస్తూ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌లో డైరెక్టర్‌గా స్థానం కల్పించారని తెలిపారు. బీసీ జనగణనకు నడుం బిగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి వేణుగోపాలకృష్ణలకు మైనార్టీ బీసీల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

రామచంద్రపురం: కె.గంగవరం గ్రామ ఎంపీటీసీ పెద్దిరెడ్డి రామతులసి, ఏసు దంపతుల కుమారుడు పెద్దిరెడ్డి చరణ్ ఆదిత్య ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మృతి చెందాడు. ఆ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి అందిన రూ.10 లక్షల చెక్కును రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పంపన సుబ్బారావు, కోటి వెంకట్రావు, సొసైటీ చైర్మన్ ఈదర రమేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వల్లు శ్రీనివాస్, కుందూరు సొసైటీ చైర్మన్ పర్వతనేని రామకృష్ణ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న మంత్రి వేణు

భక్తిశ్రద్ధలతో జుమ్మతుల్ విధా

రామచంద్రపురం రూరల్: రంజాన్ మాసం చివరి శుక్రవారం ముస్లింలు జుమ్మతుల్ విధాను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ద్రాక్షారామ షియా జామియా జాఫరీ మసీదులో మత గురువు మీర్జా అస్కరీ హుస్సేన్ మజ్లిస్ ఆలపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

కపిలేశ్వరపురం: టేకి గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి గరగలను గ్రామంలో ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలతో జాతర సందడిగా సాగింది. దూరపు ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామానికి చెందిన ఆడపడుచులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



టేకిలో ముత్యాలమ్మకు మొక్కుతున్న భక్తులు

బీమా సొమ్ము అందజేత

రాయవరం: వి.సావరంలో వల్లు నాగలక్ష్మికి వైఎస్సార్ బీమా సొమ్మును శుక్రవారం అందజేశారు. ఈ నెల 20న వల్లు సత్యనారాయణ(42) మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.10 వేలను ఎంపీపీ నౌడు వెంకటరమణ చేతుల మీదుగా నాగలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకి కృష్ణవేణి, ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ మేడిశెట్టి నాగమణి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా రాజశేఖర్

ఆలమూరు: స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గానికి సంబంధించి శుక్రవారం సంయుక్త కార్యదర్శి పదవికి ఎన్నికల్లో జి.రాజశేఖర్ ఎన్నికయ్యారు. ఇప్పటికే అధ్యక్షుడిగా సలాది సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడిగా నరాకుల సత్యనారాయణ, కార్యదర్శిగా మాతా మహేశ్వరరావు, కోశాధికారిగా బి.విద్యాప్రసన్న ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శి పోటీలో జె.జోగానందరావు మీద 16 ఓట్ల మెజారిటీతో రాజశేఖర్ గెలుపొందాడు.